విలేఖర్లు కావలెను

జ్యోతి ప్రభంజనం దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో జిల్లాలకు బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్ సి ఇన్చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను.

సంప్రదించ వలసిన నెంబర్:
7095999737,9908103501



PRGI NO:TGTEL/26/A6501

# జ్యోతి ప్రభంజనం

తెలుగు దిన పత్రిక

సంపుటి :01 సంచిక:04 ఎడిటర్: రాపోలు లింగస్వామి 04 -09 -2026 శుక్రవారం

Printed/:Rangareddy , Published By: Hyderabad , Nalgonda, Rangareddy, Mahaboobabad, Medak,worangal,Nizamabad, Adilabad,Karimnagar,Kammam, పేజీలు:4 వెల: 2-00


## సంప్రదాయాల సొబగులతో కృష్ణాష్టమి వేడుకలు

చిట్యాల,నల్లగొండ: సెప్టెంబర్ 03(జ్యోతి ప్రభంజనం): చిన్నారుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించేందుకు పండుగల విశిష్టతను తెలియజేయడం అవసరమని చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలోని సౌమ్య విద్యామందిర్ పాఠశాల డైరెక్టర్ బొడిగె రవీందర్ అన్నారు. చిట్యాల మండలం చిన్నకాపర్తిలోని సౌమ్య విద్యామందిర్‌లో ప్రిన్సిపల్ బొడిగె విజయ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడి చిత్రపటంతో పాటు ఉట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



చిన్నారులు కేరింతలు కొడుతూ సందడి చేయగా, శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో వచ్చిన విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పండుగల నిర్వహణ ద్వారా చిన్నారులకు మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని సులభంగా పరిచయం చేయవచ్చని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రుద్రారపు లావణ్య, మునుకుంట్ల వేణు, మునుకుంట్ల స్వాతి, బొడిగె రాణి, గండమల్ల చర్విత, రేగులగడ్డ ప్రశాంతి, సూరోజు హర్షిణితో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రవిదాస్ చిత్రపటాలపై నల్లరంగు ఘటనపై చర్యలు తీసుకోవాలి

చిట్యాల,నల్లగొండ: సెప్టెంబర్ 03 (జ్యోతి ప్రభంజనం): హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆగస్టు 31న సంతు రవిదాస్ చిత్రపటాలకు నల్లరంగు చల్లిన ఘటనపై బాధ్యులైన యువజన కాంగ్రెస్ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎస్సీ మోర్చా, సమగర మోచి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం చిట్యాల ఎస్ఐ బి.వెంకటరెడ్డికి వారు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల ఆరాధ్యదైవంగా భావించే సంతు రవిదాస్ చిత్రపటాలపై నల్లరంగు చల్లడం బాధాకరమన్నారు. ఘటనకు పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి చట్టపరమైన



చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంతు రవిదాస్ జయంతి ఉత్సవాల రాష్ట్ర కన్వీనర్ మాస శ్రీనివాస్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి రుద్రవరం లింగస్వామి, రాష్ట్ర నాయకుడు చికిలంమెట్ల అశోక్, పట్టణ బీజేపీ అధ్యక్షుడు గుండాల నరేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సుంచు శ్రీను, కూరెళ్ల శ్రీనివాస్, జయారపు రామకృష్ణ, కంచర్ల శంకర్‌రెడ్డి, సమగర మోచి సంఘం నాయకులు చంద్రగిరి రవికుమార్, మాస నరేష్, శివమదన్, శివసాయి పాల్గొన్నారు.

## ముసలవ్వను ఎత్తుకున్న మాజీ మంత్రి

హైదరాబాద్, సెప్టెంబర్ 03: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా మేడ్చల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు విధ్వంస నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని ఎదులాబాద్ గ్రామంలో జరిగిన ఈ కార్య క్రమంలో మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఒక ము సలవ్వను తన భుజాలపై ఎత్తు కుని ప్రభుత్వ వైఫల్యాలకు వ్యతి రేకంగా వినూత్న రీతిలో నిరసన తెలిపిఅందరి దృష్టిని ఆకర్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మల్లారెడ్డి మాట్లాడుతూ...



కేసీఆర్ పాలనలో అన్నదాతలు సుభిక్షంగా ఉంటూ రాజభోగం అనుభ వించారని గుర్తుచేశారు. తెలంగాణను అన్నపూర్ణ రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని ప్రశంసించారు. వ్యవసాయానికి ఉచిత కరెంట్, సాగునీరు, ఎరువులతో పాటు రైతుబంధు, రైతు బీమా వంటి విప్లవాత్మక పథకాలను ప్రవేశపెట్టి దేశానికే తెలంగాణను ఆదర్శంగా నిలిపారని మల్లారెడ్డి తెలిపారు.

## సైదాబాద్ స్టీల్ బ్రిడ్జ్ ప్రారంభించిన ముఖ్యమంత్రి



హైదరాబాద్: సైదాబాద్ స్టీల్ ఫ్లైఓవర్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం స్టీల్ బ్రిడ్జికి సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సీఎం రేవంత్ రెడ్డి, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఫ్లైఓవర్ వివరాలను ముఖ్యమంత్రికి జీహెచ్ఎంసీ అధికారులు వివరించారు. దీని ప్రారంభంతో గ్రేటర్ హైదరాబాద్‌లో మరో భారీ వంతెన అందుబాటులోకి వచ్చినట్లైంది. భాగ్యనగరంలో ఇప్పటికే అతి పొడవైన స్టీల్ వంతెన 2.3 కిలోమీటర్ల పొడవుతో ఇందిరాపార్కు నుంచి వీఎస్టీ వరకు ఉంది. తాజాగా సైదాబాద్ స్టీల్ బ్రిడ్జిని 3.32 కి.మీ.ల పొడవుతో రూ.620 కోట్ల వ్యయంతో నిర్మించారు. ఈ వంతెన చంచల్‌గూడ జైలు నుంచి సంతోష్ నగర్‌లోని యాదగిరి థియేటర్ వరకు ఉంది. కాగా, వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా నాలుగు లేన్ల ఈ బ్రిడ్జి నిర్మాణానికి 2020లో శంకుస్థాపన జరిగింది. ఈ వంతెన అందుబాటులోకి రావడంతో నల్లగొండ ఎక్స్ రోడ్డు నుంచి ఒవైసీ ఆస్పత్రి జంక్షన్ వరకు 5 నిమిషాల్లోనే చేరుకునే అవకాశం లభించింది. కాగా, ప్రస్తుతం ఈ మార్గంలో ప్రయాణించేందుకు 30 నుంచి 40 నిమిషాల సమయం పడుతోంది. తాజాగా బ్రిడ్జి ప్రారంభంతో నగరవాసులకు ప్రయాణం సులభం కానుంది.

## మనల్ని ఎందుకు సీఎం చేయలేదు..

కొండాసురేఖను కాంగ్రెస్ సర్కార్ కేబినెట్ నుంచి బర్తరఫ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్



అవుతున్నాయి. బ్రేకింగ్ అండ్ షాకింగ్ న్యూస్..కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తప్పించేస్తున్నారు. ఈ కాంగ్రెస్ పార్టీలో ఇదే 5 శాతం ఉన్న రెడ్డిలకు 80 సంవత్సరాల్లో 12 మందిని ముఖ్య మంత్రులను చేసింది. మనం 50 శాతం బీసీలం ఉన్నాం. 27శాతం కాపులమున్నాం. 90 శాతం బడుగు బలహీన వర్గాలం ఉన్నాం. మనల్ని ఒక్కసారైనా ముఖ్యమంత్రిని ఎందుకు చేయలేదు. చేయరు. చేయబోరన్నారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోండి. అందుకే కొండాసురేఖను బీసీ బిడ్డగా, మహిళగా నిన్ను ముఖ్యమంత్రిని చేయాలి.. మంత్రి పదవి నుంచి తీసేస్తున్నారు ఎందుకని అడిగితే.. నీ కూతురు ఎవరినో తిట్టిందట. మరి అలా అయితే జగ్గారెడ్డి నువ్వు రూ.50 కోట్లు ఇచ్చి ముఖ్యమంత్రి అయ్యావని రేవంత్ రెడ్డిని తిట్టలేదా..? ఆయనను ఎందుకు తీయలేదని అని ప్రశ్నించారు. కోమటిరెడ్డి బ్రదర్స్, జగ్గారెడ్డి, రేవంత్ రెడ్డి ఒకరినొకరు తిట్టుకోవడం లేదా..? వాళ్ల పదవులు పోవు.. కానీ ఒక మహిళ అయితే.. ఒక బీసీ అయితే.. ఒక కాపు అయితే వెంట్రుక కూడా పీకలేం.. ఎందుకు మన బీసీ కాపులకు బుద్ధి లేక. పార్టీలు పెడతారు.. ప్యాకేజీ స్టార్లు అయి అమ్ముడుపోతారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోండి.. మనిషికో పార్టీ పెట్టకుండా.. ఇది గద్దరన్న పార్టీ.. బీజేపీ, కాంగ్రెస్‌తోపాటు అందరినీ కాదని ప్రజా శాంతి పార్టీలో చేరండి.. ప్రజలకు శాంతి రావాలంటే ప్రజా శాంతి పార్టీ కావాలి. అప్పులు తీరాలంటే అభివృద్ధి జరగాలంటే.. బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరగాలంటే ప్రజాశాంతి పార్టీ ఒకటే మార్గమన్నారు.

## కేబినెట్ నుంచి కొండా సురేఖ బర్తరఫ్



మంత్రి కొండా దంపతులు హైదరాబాద్‌లో తమ అనుచరులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని కొద్దిసేపట్లోనే సాయంత్రంలోగా రాజీనామా చేయకపోతే, లోక్‌భవన్‌కు బర్తరఫ్ లేఖ పంపిస్తామని హైకమాండ్ హెచ్చరించినట్టు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంత్రి కొండా సురేఖ వ్యవహారంలో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. మంత్రి వర్గం నుండి కొండా సురేఖను తొలగించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కొండా సురేఖను కేబినెట్ నుంచి తక్షణమే తొలగిస్తున్నట్టు సీఎంవో లేఖ విడుదల చేసింది. బర్తరఫ్ లేఖను ఇప్పటికే గవర్నర్‌కు పంపినట్టు పేర్కొంది. ఈ మేరకు లోక్ భవన్ నుంచి కాసేపట్లో ఉత్తర్వులు రానున్నట్టు సమాచారం. అదే విధంగా సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్‌గా డా. జి. చిన్నారెడ్డి నియామకాన్ని రద్దు చేసి ఆయన స్థానంలో గద్వాల్ విజయలక్ష్మిని నియమించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద నియమించారు. దీంతోపాటు కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్‌పర్సన్‌గా మాజీ రాజ్యసభ ఎంపీ గుండు సుధారాణి నియామకానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

## సాగర్ నీటి షెడ్యూల్ ప్రకటించాల్సిందే

మిర్యాలగూడ : నాగార్జున సాగర్ ప్రాజెక్టు కింద సెప్టెంబర్ 14న వినాయకచవితిలోపు నీటి విడుదలషెడ్యూల్ ప్రకటించకపోతే కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర చేస్తానని బీఆర్ఎస్ వర్కి ంగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటిం చారు. కేసీఆర్ పదేళ్ల పరిపాలన ను, మిర్యాలగూడలో గురువారం సాయంత్రం నిర్వహించిన రైతు ధర్నాలోఆయనమాట్లాడారు. ఎన్ని తడులకు నీళ్లు ఇస్తారు.. ఎప్పుడె ప్పుడు ఇస్తారో ప్రభుత్వం స్ప ష్టంచేయాలని డిమాండ్



చేశా రు. సాగర్‌లో నీళ్లున్నా మంత్రు లకు సోయి లేదని విమర్శించా రు. శ్రీశైలంలో 537 అడుగుల నీరు ఉందని కేటీఆర్ అన్నారు. అంగట్లోఅన్నీఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా..సాగర్ లో నీళ్లు ఉన్నా జిల్లాలోని మంత్రులకు సోయి లేదని విమర్శించారు. సాగర్‌లో నీళ్లు ఉన్నా ఇద్దరు మంత్రులు శనిలా గా దాపురించారని వ్యాఖ్యానించారు. మంత్రిఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలం గాణ రైతుల కళ్లలో కన్నీళ్లు పెట్టిస్తు న్నారని ఆరోపించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నీళ్లలో వాటర్ కలిస్తే సొరంగం కూలిపోయిందని అంటున్నారని విమర్శించారు. కళ్లుఉండి చూడలేని మంత్రులుగా వ్యవహరిస్తున్నారని, శ్రీశైలం, నాగార్జు నసాగర్‌లో నీళ్లు ఉన్నా చూడడం లేదని అన్నారు. శ్రీశైలంలో జలవిద్యుత్ ఉత్పత్తి ద్వారా 40నుంచి 50 టీఎంసీలనీరు సాగర్‌లోకి వచ్చిం దని కేటీఆర్ తెలిపారు. శ్రీశైలంలో గేట్లు తెరిచేలోపే

# సంపాదకీయం

## రాజకీయ స్వరం మారుతున్నది

ఎన్నికలు ఏవైనా..విజయం సాధించేందుకు అర్థబలం, అంగబలం, మతం, కులం ప్రధాన ఆయుధాలుగా ఉపయోగపడుతున్నాయి. ప్రజాస్వామ్య విజయానికి నాలుగు స్తంభాల విషయం ఎలా ఉన్నా, ఎన్నికల్లో విజయానికి ఈ నాలుగు బలాలు తప్పనిసరి. అది ఇప్పటివరకు ఉన్న లెక్క. కానీ ఢిల్లీలో జంతర్ మంతర్ ఉద్యమం తర్వాత ఈ లెక్క మారడం కనిపిస్తున్నది. ఈ మార్పు చాలా వేగంగా ఉండకపోవచ్చు. కానీ మార్పు ప్రారంభం కావడం ప్రజాస్వామ్యానికి మంచిది. బిహార్‌లో ఒకే ఒక్కడు (ప్రశాంత్ కిశోర్) చూపిస్తున్న ప్రభావం, ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే తెలంగాణలో అధికార పక్షం ఓటమి, బీఆర్ఎస్ విజయం అని చెప్తున్న పలు సర్వేలు, ఇండియా టుడే దేశవ్యాప్తంగా జరిపిన సర్వే, బడిపిల్లలు విద్యావ్యవస్థ మెరుగు కోసం జరుపుతున్న ఆందోళనలు ఇవన్నీ చూస్తుంటే రాజకీయ స్వరం మెల్లగా మారుతున్నదనే అభిప్రాయం కలుగుతున్నది.మౌలిక సమస్యలు రాజకీయాల్లో ప్రధాన అంశాలు కావు అని నిరాశ ఆవహించిన సమయంలో యువతరం దేశ రాజకీయాల్లో పెద్ద కుదుపు తీసుకువచ్చారు. ఈ దేశం రాజకీయ నాయకుల వ్యాపార కేంద్రం కాదు.. మనందరిది అని తెలియజేశారు. సమకాలీన దేశ రాజకీయాలను జంతర్ మంతర్‌కు ముందు, తర్వాత అని విడదీసి చూసే పరిస్థితి. స్తబ్దుగా ఉన్న దేశ రాజకీయాల్లో యువత తీసుకువచ్చిన కదలిక సాధారణమైనది కాదు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఒక్క బీజేపీపైనే కాదు.. దేశంలోని అన్ని రాజకీయ పక్షాల మీద ఈ ప్రభావం కనిపిస్తున్నది. దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చ సాగితే అది కేంద్రంలో 12 ఏండ్ల నుంచి అధికారంలో ఉన్న బీజేపీకి ఇబ్బందికరం. అందుకే పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, నిర్వీర్యం అవుతున్న విద్యారంగం వంటి వాటిపై చర్చలు జరిగితే బీజేపీ సమాధానం చెప్పాల్సి ఉంటుంది. అందుకే ఆ పార్టీ ఇలాంటి అంశాలపై చర్చను కోరుకోదు.అయితే ఈసారి మాత్రం బీజేపీ ఎజెండాను నిర్ణయించలేక పోతున్నది. ఎజెండాను ప్రజలు నిర్ణయిస్తున్నారు. యువత నిర్ణయిస్తున్నది. చివరకు బడిపిల్లలు కూడా నిర్ణయిస్తున్నారు. దేశంలో ఎంతోకాలం నుంచి నిరుద్యోగం, ధరలు ప్రజలను భయ పెడుతున్నాయి. నిరుద్యోగులకు ఉద్యోగం లేదనే బాధ అయితే, ప్రైవేట్ రంగంలో ఉద్యోగం చేస్తున్న యువత తమ ఉద్యోగం ఉంటుందో ఊడుతుందోననే భయంతో బతుకుతున్నారు. తెలంగాణలో కల్వకుంట్ల తారక రామారావు, బిహార్‌లో ప్రశాంత్ కిశోర్ లాంటి వాళ్లు, దేశంలో రాహుల్ గాంధీ యువతకు చేరువవుతూ వారి ఆకాంక్షల మీద, వారు ఎదుర్కొంటున్న సమస్యల మీద దృష్టి పెడుతున్నారు. కానీ బీజేపీ మాత్రం వందేమాతరం వంటి అంశాల ద్వారా యువతలో చీలిక తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నది. వందేమాతరం ప్రయోగం బీజేపీ ఆశించిన ఫలితాన్ని చూపలేదు. అయోధ్య రామాలయాన్ని ప్రారంభించిన తీరు, హుండీలో వందల కోట్ల రూపాయల చోరీతో ఓట్ల కోసమే తప్ప నిజంగా మతం మీద గౌరవం లేదనిపిస్తున్నది.ప్రజల్లోనే కాదు, అధికారుల్లో సైతం మార్పు కనిపిస్తున్నది. బీహార్‌లోని బాంకీపుర్ అసెంబ్లీ స్థానానికి ఇటీవల జరిగిన ఉపఎన్నికలో ప్రశాంత్ కిశోర్ విజయం సాధించారు. ఎన్నికల్లో విజయానికి అంగబలం, అర్థబలం, కులం, మతం అనివార్యం కాదని నిరూపించిన విజయం ఇది. ఒక్కరు గెలిచి సాధించేదేంది? అనిపించవచ్చు. కానీ బిహార్‌లో ఒకే ఒక్కడు సాధించి చూపించాడు. విజయం సాధించిన తర్వాత ఊరేగింపులు, విజయోత్సవాలేవీ లేవు. నేరుగా కార్యరంగంలోకి దిగడమే. విజయం సాధించాక ఇటీవల పీకే తన నియోజకవర్గంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆ సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, మూడు విభాగాల కార్యదర్శులు హాజరయ్యారు. విషయ పరిజ్ఞానం ఉంటే ఇలా ఉంటుందని ప్రశాంత్ కిశోర్ చూపిస్తున్నారు. ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి దొంగ సర్టిఫికెట్ల చదువు మీద పీకే రోజూ ఆరోపణలు చేస్తున్నారు. సీఎం ఎక్కడికి వెళ్లినా అన్‌పడ్ సీఎం (చదువు రాని సీఎం) అని యువకులు నినాదాలు చేస్తున్నారు. అధికారపక్షం, ప్రతిపక్షం ఇద్దరి మీదా పీకే ఒత్తిడి తీసుకురాగలుగుతున్నారు. పీకే విజయం చదువుకున్నవారు కూడా రాజకీయాల్లోకి రావచ్చుననే సందేశం ఇస్తున్నది. తన నియోజకవర్గంలో పది వేల మందికి ఉద్యోగాలు ఇప్పించి చూపిస్తానని సవాల్ చేసి ఆ దిశగా ఇపుడు అడుగులు వేస్తున్నారు. పనిచేయకపోతే ప్రజలు ఓడిస్తారనే భయం లేనంతవరకు బిహార్ బాగుపడదని ఆయన అంటున్నారు. ఇప్పుడు పీకే పనితీరు రాష్ట్రంలోని మిగిలిన ఎమ్మెల్యేలను సైతం భయపెడుతున్నది. ఇది ఒక్క బిహార్‌లోనే కాదు.. దేశమంతటా అవసరం. బూతులతో, కులం, మతం బలంతో గెలుస్తామని విర్రవీగే నేతలందరికీ పనిచేయకపోతే ప్రజలు ఓడిస్తారనే భయం ఉండాలి.

# రైల్వే కనెక్టివిటీతో భద్రాచలానికి కొత్త శోభ

**- రైల్వే రవాణా అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్**
**- పాండురంగాపురం?మల్కన్‌గిరి రైల్వే లైన్‌లో సాకేతపురి వరకు పనులకు లైన్ క్లియర్**
**- రైల్వే లైన్ పనులను ముందుగా చేపట్టాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి**
**- మంత్రి విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్**

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధికి కీలకమైన పాండురంగాపురం?మల్కన్‌గిరి రైల్వే లైన్‌కు




మరోసారి కదలిక వచ్చింది. వివిధ కారణాలతో పూర్తి ప్రాజెక్టు ఆలస్యమవుతున్న నేపథ్యంలో ప్రస్తుత దశలో పాండురంగాపురం నుంచి మధ్యలోని సాకేతపురి(సారపాక) వరకు సుమారు 16 కి.మీ. రైల్వే లైన్ పనులను ముందుగా చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. మంత్రి తుమ్మల విజ్ఞప్తిపై కేంద్ర రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించి ఈ మార్గంలో పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.పూర్తి ప్రాజెక్టుకు పలు అవరోధాలు..రైల్వే మంత్రితో జరిగిన చర్చలో పాండురంగాపురం?మల్కన్‌గిరి రైల్వే లైన్ ప్రస్తుత పరిస్థితిని మంత్రి తుమ్మల వివరించారు. గతంలో రైల్వే మంత్రులుగా పనిచేసిన లాలూ ప్రసాద్ యాదవ్, మమతా బెనర్జీ, సురేశ్ ప్రభు, పీయూష్ గోయల్ హయాంలోనూ ఈ రైల్వే లైన్ ప్రతిపాదనకు అనుకూలత లభించినప్పటికీ వివిధ కారణాలతో పనులు పూర్తిస్థాయిలో ముందుకు సాగలేదని తెలిపారు.భూసేకరణ అటవీశాఖ అనుమతులు గోదావరి వంతెనతో పాటు ఇతర రైల్వే వంతెనల నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియలు పూర్తి ప్రాజెక్టుకు ప్రధాన అవరోధాలుగా ఉన్నాయని మంత్రి వివరించారు. ఈ అంశాలన్నింటినీ పరిష్కరించి పాండురంగాపురం?మల్కన్‌గిరి పూర్తి రైల్వే లైన్‌ను నిర్మించేందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉందన్నారు.సాకేతపురి వరకు ముందుగా పనులు..పాండురంగాపురం నుంచి సాకేతపురి (సారపాక) వరకు సుమారు 16 కి.మీ మేర రైల్వే లైన్ నిర్మాణానికి పెద్దగా అవరోధాలు లేనందున ఈ దశలో ఆ పనులను ముందుగా చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి తుమ్మల కోరారు.

పాండురంగాపురం?సాకేతపురి మధ్య రైల్వే లైన్‌కు అవసరమైన భూసేకరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టి అవసరమైన భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రికి తెలిపారు.తుమ్మల విజ్ఞప్తికి తక్షణ స్పందన..మంత్రి తుమ్మల విజ్ఞప్తిపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందించారు. పాండురంగాపురం?సాకేతపురి మార్గంలో పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రైల్వే అధికారులను ఆదేశించారు. దీంతో ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న భద్రాద్రి ప్రాంత రైల్వే కనెక్టివిటీకి తొలి అడుగు పడినట్లయింది.భక్తులకు మరింత చేరువలో భద్రాచలం..దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి దేశ నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఈ రైల్వే మార్గం ఎంతో ప్రయోజనకరంగా మారనుంది. సాకేతపురి వరకు రైల్వే సౌకర్యం అందుబాటులోకి వస్తే భద్రాచలం ప్రాంతానికి రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. రైల్వే కనెక్టివిటీతో భద్రాచలంలో ఆధ్యాత్మిక పర్యాటకానికి కొత్త ఊపు వచ్చే అవకాశం ఉంది. భద్రాచలం, గోదావరి పరివాహక ప్రాంతాల్లో పర్యాటక కార్యకలాపాలు విస్తరించడంతో పాటు భక్తులు పర్యాటకుల రాక పెరగడం ద్వారా స్థానికంగా ఉపాధి వ్యాపార అవకాశాలు మెరుగుపడనున్నాయి.పారిశ్రామిక రంగానికి రవాణా బలం..భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పారిశ్రామిక రంగానికి కూడా రైల్వే కనెక్టివిటీ కీలకంగా మారనుంది. సింగరేణి, బీపీఎల్, వాటర్ ప్లాంట్లు, కేటీపీఎస్ తదితర పరిశ్రమలకు ముడిసరుకు ఉత్పత్తుల రవాణా మరింత సులభతరం కానుంది. రైల్వే సౌకర్యం అందుబాటులోకి రావడంతో కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు ఆకర్షించేందుకు అనుకూల వాతావరణం ఏర్పడనుంది.భూసేకరణకు రాష్ట్రం సిద్ధం..కేంద్రం నుంచి సానుకూల స్పందన లభించిన నేపథ్యంలో పాండురంగాపురం?సాకేతపురి మధ్య భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి అవసరమైన భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు.పాండురంగాపురం?మల్కన్‌గిరి రైల్వే లైన్ నిర్మాణానికి ఉన్న అడ్డంకులు ఒక్కొక్కటిగా తొలగుతున్న క్రమంలో ఈ దశలో సాకేతపురి వరకు రైల్వే లైన్ అందుబాటులోకి రావడం భద్రాద్రి ప్రాంత అభివృద్ధికి కీలక మలుపుగా నిలవనుంది. ఆధ్యాత్మిక పర్యాటకం పారిశ్రామిక ప్రగతి స్థానిక ఉపాధి వ్యాపార అవకాశాలకు ఈ రైల్వే కనెక్టివిటీ మరింత బలాన్నివ్వనుంది.

# 22ఏ నిబంధనల పేరుతో పేదల భూములను లాక్కోవడం సరికాదు

**ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించిన ఎంపీ ఈటల రాజేందర్**
**118 జీఓ అంశంపై అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ**

హైదరాబాద్,జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి,సెప్టెంబర్ 3: తెలంగాణ రాష్ట్రంలో 22ఏ నిబంధనల పేరుతో పేదలు, మధ్యతరగతి ప్రజలు, రైతులు దశాబ్దాలుగా అనుభవిస్తున్న భూములపై హక్కులను కోల్పోయే పరిస్థితి ఏర్పడటం ఆందోళనకరమని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. రిజిస్ట్రేషన్ల నిషేధిత భూముల జాబితాలో భూములను చేర్చే విషయంలో ప్రభుత్వం ఆచితూచి వ్యవహరించాలని ఆయన సూచించారు.షామీర్‌పేటలోని ఈటల రాజేందర్ నివాసంలో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ జీహెచ్ఎంసీ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని 118 జీఓకు సంబంధించిన భూముల సమస్యపై ఇరువురు చర్చించారు.దశాబ్దాలుగా ప్రజలు నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న భూములను 22ఏ నిబంధనల పరిధిలోకి తీసుకురావడం వల్ల సామాన్యులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని



సంబంధిత అధికారులను కోరనున్నట్లు తెలిపారు.118 జీఓ అంశంపై త్వరలోనే సంబంధిత అధికారులతో చర్చించి, సమస్యకు వీలైనంత త్వరగా పరిష్కారం లభించేలా కృషి చేస్తామని మొద్దు లచ్చి రెడ్డికి ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. ప్రజల భూ హక్కులను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## అంతంపల్లి పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ

గట్టు, జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 03:అంతంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు సర్పంచ్ చేతుల మీదుగా ఉచిత యూనిఫాంల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ



కార్యక్రమానికి గ్రామ కార్యదర్శి మారెప్ప, గ్రామ పెద్దలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. రంగన్న మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం ఒక్కొక్కరిపై ఏడాదికి సుమారు లక్ష రూపాయలకు పైగా ఖర్చు చేస్తోందని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని, బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. తద్వారా తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు దానయ్య, వార్డు సభ్యులు బీసన్న, ఉపాధ్యాయులు అశోక్, పరశురాం మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కోల్పోయిన తర్వాత...

కోల్పోయిన ప్రతీదాని విలువ
ఏదో ఒకరోజు తప్పక తెలుస్తుంది...



కానీ కోల్పోయిన దాన్ని
తిరిగి పొందే రోజు మాత్రం రానే రాదు...
చేతిలో ఉన్నప్పుడు సాధారణంగా కనిపించినది
చేతులు జారిన తర్వాత అమూల్యమైపోతుంది...
మనతో ఉన్నప్పుడు పట్టించుకోని మనిషి
మనకు దూరమైన తర్వాత జ్ఞాపకమై మిగులుతాడు...
అనుబంధాలు తెగిపోయినప్పుడు
వాటి వెనుక దాగిన ప్రేమ అర్థమవుతుంది...
మాట్లాడే అవకాశం ఉన్నప్పుడు మౌనంగా ఉన్నవాళ్లు
ఒక్క మాట కోసం జీవితాంతం ఎదురుచూస్తారు...
కలిసి నడిచిన అడుగుల విలువ
ఒంటరిగా నడిచిన దారిలో తెలుస్తుంది..
మన కోసం ఎదురుచూసిన వారి విలువ
వాళ్లు ఇక ఎదురు చూడని రోజున తెలుస్తుంది...
కోల్పోయిన వస్తువు తిరిగి దొరకవచ్చు
కానీ కోల్పోయిన క్షణం మాత్రం తిరిగి రాదు...
విరిగిన వస్తువును అతికించవచ్చు
విరిగిన అనుబంధాన్ని మాత్రం మునుపటిలా చేయలేం...
అందుకే ఉన్నదాన్ని ఉన్నప్పుడే గౌరవించాలి
మనిషిని మనతో ఉన్నప్పుడే ప్రేమించాలి...
ఎందుకంటే చివరికి అన్నీ వదులు కోవాల్సిందే
కానీ వదిలేసిన వాటి జ్ఞాపకాలు మాత్రం మనల్ని వదలవు...
జీవితం నేర్పే అతి చేదైన నిజం ఇదే
విలువ తెలిసే సమయానికి
కోల్పోయినది మన చేతుల్లో ఉండదు.

రచన : కె.మురళీమోహన్ రాజు, నెల్లూరు.
చరవాణి : 9866179385

# 1000 రోజుల కాంగ్రెస్ పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి శూన్యం

### రైతులతో కలిసి కందుకూరులో బీఆర్ఎస్ నిరసన

కందుకూరు , జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, సెప్టెంబర్ 03:కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నేటికి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వానికి నిరసనగా కందుకూరు మండల కేంద్రంలోబీఆర్ఎస్ నాయకులురైతులతో కలిసి నిరసన కార్యక్ర మం నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమ యంలో ప్రజలకు ఇచ్చిన 100రోజుల గ్యారంటీ కార్డులను ప్రజల కు పంచిపెట్టి, హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతులకు ఇచ్చిన హామీలు, పథకాల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని అన్నారు. కాంగ్రెస్ 100 రోజుల గ్యారంటీ కార్డులో ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తుచేస్తూ.. 1000 రోజుల పాలనలో వ్యవసాయంతో పాటు విద్య, వైద్యం, ఉపాధి, సంక్షేమం, అభివృద్ధి తదితర అన్ని రంగాల్లో ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. 100 రోజుల్లో హామీల అమలు చేస్తామని చెప్పి 1000 రోజులు గడిచినా ప్రజలకు సమాధానం చెప్పలేని పరిస్థితిలో కాంగ్రెస్



ప్రభుత్వం ఉంది. హామీలు అమలు చేసే వరకు ప్రజల తరఫున బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని నాయకులు స్పష్టం చేశారు. రైతులు, ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత హామీలపై మాజీ కార్పొరేటర్ ఆధ్వర్యంలో నిరసన

సికింద్రాబాద్,జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి,సెప్టెంబర్ 03:భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ పిలుపు మేరకు, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు చేపట్టిన ఏడు రోజుల నిరసన కార్యక్రమంలో భాగంగా రెండో రోజు చిలకలగూడ గాంధీ విగ్రహం సమీపంలో మాజీ కార్పొరేటర్ డా. సామల హేమ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డా. సామల హేమ మాట్లాడుతూ.. 22ఏను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తోందని ఆమె తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల ముందు ప్రతి వర్గానికి అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు పూర్తవుతున్నా వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు, నిరుద్యోగులు, వృద్ధులు, పేదలు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. హామీల అమలుపై ప్రజలు ప్రశ్నిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పకుండా ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోందని డా. సామల హేమ మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలపై ప్రశ్నించే బాధ్యత ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పార్టీపై ఉందని, ప్రజలకు అన్యాయం జరిగిన ప్రతి సందర్భంలో బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాటం చేస్తుందని ఆమె స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా,



ప్రజల సమస్యలను మాత్రం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం ప్రజల ముందుకు తీసుకువస్తుందని అన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని డా. సామల హేమ డిమాండ్ చేశారు. అనంతరం బాకీ కార్డులను పంపిణీ చేసి, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, మోసాలను ప్రజలకు వివరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గౌడ్ శ్రీను, అనిల్ కుమార్, సాయి యాదవ్, జాకీర్, మస్తాన్, సాగర్ గౌడ్, రహీం పాషా, అశ్విన్, రవీంద్ర సాగర్, కరీంలాలా, శంకర్, బాలాజీ, టీవీ శ్రీను, గౌతం, చిట్టి, సురేష్, జ్ఞానేశ్వర్, నాగేందర్, అజీజ్, బాబు రావు తదితరులు పాల్గొన్నారు. మహిళా నాయకులు మణి మంజరి, లలిత, లక్ష్మి, ఎర్ర జ్యోతి, అనిత, శ్యామల, ఝాన్సీ, పులమ్మ, ప్రవళిక, అర్చన, పద్మ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ సర్కార్ విఫలం

### పద్మారావునగర్‌లో నేడు బీఆర్ఎస్ 'వంటా వార్పు

సికింద్రాబాద్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి,సెప్టెంబర్ 03:కాంగ్రెస్ ప్రభుత్వం 1,000రోజుల పాలనలో ఎన్నికల సమ యంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వి ఫలమైందని బీఆర్ఎస్ పద్మారావునగర్ డివిజన్ ఇన్‌చార్జి గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పిలుపు మేరకు శుక్రవారం ఉదయం 10 గంటలకు పద్మారావునగర్ చౌరస్తాలో 'వంటా వార్పు' నిరసన కార్యక్రమం నిర్వహించనున్న ట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు రూ. 2,500ఆర్థిక సాయం, కళ్యాణలక్ష్మి పథకం కింద తులంబంగారం,విద్యార్థినులకు ఉ చిత స్కూటీలు అంది స్తామని కాంగ్రెస్‌హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. అయితే 1,000రోజుల పాలన పూర్తయినా హామీలను అమలు చేయ కుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పద్మారావునగర్ డివిజన్‌లో నాలుగు రోజుల పాటు వివిధ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పవన్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం 'వంటా వార్పు' కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ



వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే తమ నిరసనల లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

### హామీలు అమలు చేయకుండా గొప్ప పాలన అంటూ ప్రచారం

హైదరాబాద్,జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి,సెప్టెంబర్ 03:ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం బ్రహ్మాండమైన పాలన అందించామని సిగ్గులేకుండా ప్రచారం చేసుకుంటోందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. గురువారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై రూపొందించిన బాకీ కార్డులను విడుదల చేశారు. అనంతరం తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. అనేక ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను ఏ విధంగా మోసం చేసిందో ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చార్జిషీట్‌ను





విడుదల చేశారని తెలిపారు. వారం రోజుల పాటు సనత్‌నగర్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో కార్యక్రమాలు నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులను ప్రభుత్వం మోసం చేసిన తీరును ప్రజలకు వివరించాలని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రారంభోత్సవాలు చేస్తూ, ఆ పనులను తామే చేపట్టినట్లుగా ప్రచారం చేసుకోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారని విమర్శించారు. సనత్‌నగర్ టిమ్స్, ముసారాంబాగ్ బ్రిడ్జి, సైదాబాద్ బ్రిడ్జి వంటి అభివృద్ధి పనులు ఎవరి హయాంలో చేపట్టారో ప్రజలకు తెలియదా అని ప్రశ్నించారు. పనులు పూర్తికాకుండానే ప్రారంభోత్సవాలు చేయాల్సిన అవసరం ఏముందని తలసాని ప్రశ్నించారు. రైతులకు రుణమాఫీ, వికలాంగుల పెన్షన్‌ను రూ. 6 వేలకు పెంచడం, విద్యార్థినులకు స్కూటీలు ఇవ్వడం వంటి హామీలను కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో ప్రకటించలేదా అని నిలదీశారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల భవిష్యత్‌తో ప్రభుత్వం ఆటలాడుతోందని ఆరోపించారు. అస్తవ్యస్తమైన పాలనతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ, మరోవైపు బ్రహ్మాండమైన పాలన అందిస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దఎత్తున ప్రకటనలు చేసుకుంటోందని విమర్శించారు. రాష్ట్రంలో పాలనను గాలికొదిలేసి ఢిల్లీలో ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని అంతర్గత కొట్లాటలు, దోపిడీలతోనే పాలన సాగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలు, వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ఆ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు నిరంతరం పోరాడతామని తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, డివిజన్ అధ్యక్షులు కొలన్ బాల్‌రెడ్డి, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, గుర్రం పవన్‌కుమార్ గౌడ్, హన్మంతరావు, వెంకటేషన్ రాజు, శ్రీనివాస్ గౌడ్, నాయకులు టి. శ్రీహరి, కిషోర్, నరేందర్‌రావు, ఏసూరి మహేష్, కొండాపురం మహేష్ యాదవ్, సురేష్ గౌడ్, ప్రేమ్, ప్రవీణ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రమణ, అనిత, నాగలక్ష్మి, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

# కోతులారం ముద్దుబిడ్డకు అరుదైన గౌరవం

### బోధన, పరిశోధనలో అత్యుత్తమ ప్రతిభకు డా. జగదీశ్వర్ కందులకు 'బెస్ట్ టీచర్ అవార్డు?2026'

నల్గొండ జిల్లా , జ్యోతి ప్రభంజనం,సెప్టెంబర్ 5: బోధన, పరిశోధన, విద్యార్థుల అభివృద్ధి, విశ్వవిద్యాలయ సేవల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన గీతం (డీమ్డ్ టు బి యూనివర్సిటీ) హైదరాబాద్ క్యాంపస్ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. జగదీశ్వర్ కందులకు 'బెస్ట్ టీచర్ అవార్డు?2026' లభించింది. విద్యారంగంలో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించిన విశ్వవిద్యాలయం ఈ ప్రతిష్టాత్మక పురస్కారంతో సత్కరించింది. 15 ఏళ్లకు పైగా బోధనా అనుభవం కలిగిన డా. జగదీశ్వర్ కందుల విద్యా రంగంలో తనదైన ముద్ర వేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి మెకానికల్ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ, ఐఐటీ మద్రాస్ నుంచి థర్మల్ ఇంజినీరింగ్‌లో ఎం. టెక్ పూర్తి చేశారు. అంతేకాకుండా గేట్ ?2008లో ఆల్ ఇండియా 18వ ర్యాంక్ సాధించి తన విద్యా ప్రతిభను చాటుకున్నారు. ఎలక్ట్రిక్ వాహనాలపై పరిశోధనలుప్రస్తుతం ఎలక్ట్రిక్ వాహనాలు, ఆటోమొబైల్ ఇంజినీరింగ్ రంగాల్లో డా. జగదీశ్వర్ కందుల పరిశోధనలు కొనసాగిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి జర్నల్స్, సదస్సుల్లో అనేక పరిశోధనా పత్రాలను ప్రచురించారు. ఆయన పరిశోధనా ప్రతిభకు గుర్తింపుగా ఐసీఏఏఎం ఎం- 2020లో 'బెస్ట్ పేపర్ అవార్డు' సైతం అందుకున్నారు. విద్యార్థుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యంబోధనతో పాటు విద్యార్థుల అకడమిక్ అభివృద్ధికి ఆయన విశేష కృషి చేస్తున్నారు. విద్యార్థులకు మార్గదర్శకత్వం అందిస్తూ అకడమిక్ మెంటర్‌గా సేవలందించారు. అదేవిధంగా ఎగ్జామినేషన్ కోఆర్డినేటర్, అడ్మిషన్ కోఆర్డినేటర్ తదితర కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. నల్గొండ జిల్లా కోతులారం గ్రామానికి చెందిన డా. జగదీశ్వర్ కందులకు ప్రతిష్టాత్మక 'బెస్ట్ టీచర్ అవార్డు?2026' లభించడం పట్ల గ్రామస్థులు,




విద్యావేత్తలు, విద్యార్థులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. గ్రామం నుంచి ఉన్నత విద్యా రంగంలో ఎదిగి, బోధన, పరిశోధనలో ప్రతిభ చాటుతూ అరుదైన గౌరవం అందుకోవడం కోతులారం గ్రామానికి గర్వకారణమని పలువురు పేర్కొన్నారు.

# సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సదుపాయాలు విద్యా అవకాశాలు పునరావాస సేవలు సంక్షేమ పథకాలపై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖ అధికారి డి.వాసంతి సూచించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ ఆనందఖనిలో గురువారం ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల తల్లిదండ్రులు సంబంధిత సిబ్బందికి ఒకరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఓ డి.వా సంతి మాట్లాడుతూప్రత్యేక అవసరాలుకలిగిన పిల్లల కోసం జిల్లాలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలు ఫిజియోథెరపీ సేవలు భవిత కేంద్రాల ద్వారాఅందుతున్న సేవలు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న భవిత కేంద్రాల వివరాలను వివరించారు. అలాగే సదరం సర్టిఫికెట్ ఎలా పొందాలి దాని ద్వారా లభించే వివిధ ప్రభుత్వ ప్రయోజనా లను ఎలా సద్వినియోగం చేసుకోవాలి అనే అంశాలపై తల్లిదండ్రు లకు విపులంగా అవగాహన కల్పించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల విద్యాభివృద్ధి, సమగ్ర వికాసం కోసం మండల స్థాయిలో అందుబాటులో ఉన్న సేవలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. పిల్లల ఇబ్బందులను గుర్తించి వారికి అవసరమైన విద్యా వైద్య పునరావాస సంక్షేమ సేవలను అందిస్తూ వారి ప్రగతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు విద్య ఉపాధి సామాజిక జీవనం తదితర రంగాల్లో ముందుకు వెళ్లేందుకు తల్లిదండ్రులు ఉ



పాధ్యాయులు ప్రత్యేక ఉపాధ్యాయులు సంబంధిత శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని అధికారులు సూచించారు. ఈ అవగాహన సదస్సులో సిఎంఓ తుమ్మలపల్లి. రామారావు, డిస్ట్రిక్ట్ ప్లానింగ్ కోఆర్డినేటర్ సతీష్, మండల విద్యాశాఖ అధికారి మధురవాణి, ఆనందఖని ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, డిఆర్డిఏ డిపిఓ నర్మదా, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల తల్లిదండ్రులతో పాటు విద్యాశాఖకు చెందిన స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు ఫిజియోథెరపిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులను గౌరవించాలి

**– కరస్పాండెంట్ షేక్ అబ్దుల్ బాసిత్**
**– టీచర్లకు ఆటల పోటీలు**
**– సందడిగా మారిన మోడ్రన్ ఇక్రా స్కూల్**

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం): ఉపాధ్యాయులను విద్యార్థులు గౌరవించినప్పుడే విద్యాభివృద్ధిలో ముందుకు వెళ్తారని మోడ్రన్ ఇక్రా స్కూల్ కరస్పాండెంట్ షేక్ అబ్దుల్ బాసిత్ అన్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సుభాష్ చంద్ర బోస్ నగర్ లో ఉన్న మోడ్రన్ ఇక్రా స్కూల్ ల్లో ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా గురువారం స్కూల్ టీచర్లకు ఆటల పోటీలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా షేక్ అబ్దుల్ బాసిత్ మాట్లాడుతూ అజ్ఞాన అంధకారాన్ని పారద్రోలి విజ్ఞాన కాంతులు పంచుతూ దేశ అభివృద్ధికి బాటలు వేసే భావి భారత పౌరులుగా మలిచే ఉపాధ్యాయులను గౌరవించాలని కోరారు. డాక్టర్లుగా ఇంజినీర్లుగా పోలీసులుగా రాజకీయ నాయకులుగా మలిచే టీచర్లు ఏదైనా అవసరం కలిగి వారి వద్దకు వెళ్తితే మేము వీరి వల్లే ఈ స్థాయికి వచ్చాం అని మరచి పోయి వ్యవహరించడం బాధాకరం అన్నారు. పిన్ లాండ్ లాంటి దేశాల్లో రాష్ట్రపతి, ప్రధాన మంత్రి కన్నా ఉన్నతంగా చూస్తారని మీ హోదా ఆస్తి అంతస్తులన్నీ చిన్నప్పుడు ఈ టీచర్లు చేయిపట్టి ఓనమాలు దిద్దించడం వల్లే అని ప్రతిఒక్కరూ గుర్తించాలని కోరారు. తులసి దాస్ చెప్పినట్లు దైవం గురువు నా ముందు నిలబడితే ముందుగా గురువుకు దండం చేస్తాను ఎందుకు అంటే ఆ గురువే దైవాన్ని గుర్తించే జ్ఞానం ఇచ్చాడని ఈ సందర్భంగా గుర్తు చేస్తూ ఈ ఒక్క రోజు మాత్రమే కాకుండా ప్రతిరోజూ ప్రతిక్షణం గురువులను గౌరవించాలని విద్యార్థులకు తెలిపారు. పాటలతో ఉపాధ్యాయులలో జోష్... ఎప్పుడు తరగతి




గదిలో పుస్తకాలతో బోధించి కనిపించే టీచర్లకు స్కూల్ యాజమాన్యం ఆటల పోటీలు పెట్టడం వల్ల వారిలో "జోష్" కనిపించింది. టీచర్లు చిన్న పిల్లలు లాగా మారిపోయి కేరింతల కొడుతూ ఆటలు ఆడడంతో పాఠశాల ఆవరణమంతా సందడిగా కనిపించింది. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు పర్వీన్ సుల్తానా, విజయలక్ష్మి, సల్మా, సరస్వతీ, నసరత్, జేఫీషా, లతీఫా, అనితా, రుబీనా, నాజీయా, సుహాన, సల్మా జబీన్, శిరీషా తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ఏఐటీయూసీపనిచేస్తుంది

**– పోరాట ఫలితంగానే డిమాండ్లపై అంగీకారం**
**– కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి**

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీసు ఆర్ఎల్సీ సమక్షంలో జరిగిన చర్చలు నిరంతర పోరాటం ఫలితంగా సింగరేణి యాజమా న్యం పలు కీలక డిమాండ్లపై అంగీకారం తెలిపిం దని ఏఐటీయూసీ కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.వి. రమణమూర్తి తెలిపారు. గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ 8న ఏఐటీయూసీ సమ్మె నోటీసు ఇచ్చిందని అనంతరం యాజమాన్యంతో పలుమార్లు చర్చలు జరిపినా సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరా టాన్ని కొనసాగించామని తెలిపారు. ఏఐటీయూసీ ఒత్తిడితో కార్మికులకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగించే పలు అంశాలపై అగ్రిమెంట్లు జరిగాయన్నారు. ప్రధానంగా పెర్క్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్‌ను యాజమాన్యమే భరించడం సర్వీసులో సహజ మరణం పొందిన కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సహాయం 2025?26 వాస్తవ లాభాల ప్రకటన ట్రాన్స్‌ఫర్ల మూడేళ్ల నిబంధనలో మార్పు అర్హులైన మైనింగ్ స్టాఫ్ మైనింగ్ సర్దార్లకు ఓవర్‌మెన్ ప్రమోషన్లు వంటి అంశాలపై అంగీకారాలు సాధించామని పేర్కొన్నారు. అలాగే హైదరాబాద్‌లో సింగరేణి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మెడికల్ అటెండెన్స్ నిబంధనల్లో మార్పులు సింగరేణి విద్యాసంస్థల్లో సీబీఎస్ఈ సిలబస్ కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ సదుపాయం కల్పించే అంశాలపై కూడా అంగీకారం కుదిరిందన్నారు. ఖాళీ పోస్టుల భర్తీ క్యాడర్ స్కీమ్ సమస్యల పరిష్కారం మెడికల్ ఫిట్ అయిన 149 మంది డిపెండెంట్లకు నెలలోపు ఆఫీస్ ఆర్డర్లు జారీ చేయడం సొంత ఇంటి పథకం సేఫ్టీ మెటీరియల్ సరఫరా సూటబుల్ సర్ఫేస్ ఉద్యోగాలు తదితర అంశాలపై కూడా యాజమాన్యం సానుకూలంగా స్పందించిందని




తెలిపారు. కొత్త గనులతోనే సింగరేణి భవిష్యత్తు సింగరేణి సంస్థ అభివృద్ధికి రాజకీయ జోక్యాన్ని తగ్గించాలని కొత్త బొగ్గు గనులు కేటాయించే విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని రమణమూర్తి కోరారు. బొగ్గు బ్లాకుల వేలంలో సింగరేణి చురుగ్గా పాల్గొని కొత్త బ్లాకులు సంస్థకు దక్కేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త గనులు ఉపాధి అవకాశాలు కార్మిక సంక్షేమం ఉద్యోగ భద్రతతోనే సింగరేణి భవిష్యత్తు బలోపేతమవుతుందన్నారు. కార్మికుల సమస్యలను ప్రచారానికే పరిమితం చేయకుండా పోరాటాల ద్వారా పరిష్కారాలు సాధించడమే ఏఐటీయూసీ విధానమని స్పష్టం చేశారు. ఏఐటీయూసీ సాధిస్తున్న విజయాలను కొన్ని సంఘాలు ఓర్వలేక విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని రమణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు క్రిస్టోఫర్, సహాయ కార్యదర్శి రాము, ఆఫీస్ బ్యారర్స్ నితిన్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పోరుబాటలో భాగంగా నిరసన కార్యక్రమం

ఎల్ బి నగర్, జ్యోతి ప్రభంజనం,సెప్టెంబర్ 03:బీఆర్ఎస్ పోరుబాట కార్యక్రమం నిర్వహణలో భాగంగా నాగోల్ డివిజన్ పరిధిలోని రాక్ టౌన్ కాలనీ నందు జరిగిన పోరుబాట కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎల్బీనగర్ శాసనసభ్యులు శ్రీ.దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి గారు మాట్లాడుతూ ప్రజలు తమ జీవితకాల సంపాదనను వెచ్చించి రూపాయి రూపాయి కూడబెట్టి కొనుగోలు చేసిన ప్లాట్లను సైతం 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి ఆయా భూముల యజమానులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది అని అన్నారు. ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం వారికి న్యాయం చేయకుండా అనేక ఇబ్బందులకు గురిచేస్తుండటం దుర్మార్గమైన చర్య అని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 22ఏ సమస్యతో బాధపడుతున్న బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని అక్రమంగా 22ఏ జాబితాలో చేర్చిన భూములను పరిశీలించి తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజల పక్షాన బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని బాధితులకు న్యాయం జరిగే వరకు "బీఆర్ఎస్



పోరుబాట కొనసాగుతుందని సుధీర్ రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీనియర్ బారసానాయకుడు అనంతుల రాజిరెడ్డి,డివిజన్ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి,మహేష్ రెడ్డి,సతీష్ యాదవ్,పల్ల శిల్పారెడ్డి,పోచంపల్లి రాజేందర్ రెడ్డి,మద్దెల వినయ్ కుమార్,శ్యాంసుందర్ రెడ్డి,రేవంత్ గౌడ్, చుట్టుపక్కల కాలనీ అధ్యక్ష,కార్యదర్శులు పాల్గొన్నారు

# అంతంపల్లిలో ఉచిత ప్రత్యేక వైద్య శిబిరం

గట్టు,జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 03:జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం అంతంపల్లి గ్రామంలో ఎస్బీఐ ఫౌండేషన్, భవిష్యభారత్ సంయుక్త ఆధ్వర్యంలో 'ఎస్బీఐ సంజీవని మొబైల్ మెడికల్ యూనిట్' ప్రాజెక్టు కింద గురువారం ఉచిత స్పెషలైజ్డ్ హెల్త్ క్యాంప్ నిర్వహించారు.?ఈ శిబిరంలో డాక్టర్ ఇందు మైత్రి, చర్మవ్యాధి నిపుణులు (దర్మటాలజిస్ట్)డాక్టర్ రాకేష్ రెడ్డి గ్రామీణు లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ,షుగర్, ఆర్థోపెడిక్, చర్మ సంబంధిత సమస్యలను పరిశీలించి తగిన సలహాలు ఇవ్వడంతో పాటు అవసరమైన వారికిఉచితంగా ల్యాబ్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.?ఈ క్యాంప్‌లో మొత్తం 259 మంది పాల్గొని సేవలందుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకరమ్మ దానయ్య, పంచాయతీ సెక్రటరీ మారెప్ప, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పవన్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. గ్రామంలోనే నాణ్యమైన




వైద్యం అందించిన నిర్వాహకులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# తండాలకు మహర్దశ.. రూ.3 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

**గిరిజన తండాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట**
**రూ.3 కోట్ల ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం**
**నిధులు మంజూరు చేసిన మంత్రి గుమ్మడి సంధ్యారాణికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి సవిత**

జ్యోతి ప్రభంజనం ప్రతినిధి అనంతపురం పెనుకొండ నియోజకవ ర్గంలోని అన్ని గిరిజన తండాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత జౌళి శాఖల మంత్రి శ్రీమతి ఎస్. సవిత తెలిపారు. ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల ద్వారా నియోజకవర్గంలోని అన్ని తండాల్లో అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధి కోసం రూ.3కోట్ల నిధులు మంజూరు కావడం పట్ల మంత్రి సవిత హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి గుమ్మడి సంధ్యారాణిని సచివాలయంలో మంత్రి సవిత మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పెనుకొండ మండలంలోని మక్కాజపల్లి, కొండంపల్లి, గోనిపెంట తండాలతో పాటు గోరంట్ల మండలంలోని బీఎన్ తండా, కొమ్మలతండా, బూచేపల్లి తండా, భీమ్లా నాయక్ తండా, గంగంపల్లి తండా, దాసరిపల్లి తండా, మిషన్ తండాతో పాటు పెనుకొండ నియోజకవర్గంలోని అన్ని గిరిజన తండాల్లో అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి ఈ నిధులను వినియోగించనున్నట్లు మంత్రి తెలిపారు. తండాల్లో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం పూర్తయితే వర్షాకాలంలో రాకపోకలకు ఎదురయ్యే ఇబ్బందులు తొలగడంతో పాటు పారిశుధ్యం మెరుగుపడుతుందని మంత్రి సవిత పేర్కొన్నారు. గిరిజన తండాల్లో నివసించే ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. పెనుకొండ నియోజకవర్గంలోని అన్ని గిరిజన తండాల సమగ్ర అభివృద్ధికి రూ.3 కోట్ల ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేసిన మంత్రి గుమ్మడి



సంధ్యారాణికి మంత్రి సవిత ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా నియోజకవర్గంలోని అన్ని తండాల అభివృద్ధికి అవసరమైన మరిన్ని నిధులు తీసుకువచ్చి మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తామని మంత్రి సవిత స్పష్టం చేశారు.

printed and published by **Rapolu Lingaswamy**,onbehalf of printed at **SMILYS ONLINE** 6-7-48, Vanasthali Puram Shoping Complex, Dist:Rangareddy,stete:Telangana **Editor: Rapolu Lingaswamy.pone:9908103501,** PRGI **NO:TGTEL/26/A6501 Email: rapolulingaswamy01@gmail.com**